# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం
22 ఫిబ్రవరి 2026




## కేంద్ర మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ బి. యం. సంతోష్**

**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 21 ( నినాదం)**

కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి ఈ నెల 23న అలంపూర్ ఆలయాలకు వస్తున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్లో కేంద్ర మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అలంపూర్ లోని హెలిపాడ్ నుంచి ఆలయానికి వెళ్లే రహదారిలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, తీగలు ఏమైనా ప్రమాదకరంగా ఉంటే వాటిని సరి చేయించాలని సూచించారు. అలంపూర్ పట్టణ ప్రధాన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పురపాలక సంఘం అధికారులకు తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం అతిథి మర్యాదలు చేయాలని, ఇతర అవసరమైన ఏర్పాట్లన్నీ సజావుగా పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తును నియమిస్తున్నామన్నారు. పోలీసుల గౌరవ వందనం, తమ శాఖ నుంచి చేయాల్సిన ఇతర అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ మొగిలయ్య, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస రెడ్డి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీలకు ఆర్థిక సహాయం కొరకు
# దరఖాస్తులకు ఆహ్వానం

**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 21 (నినాదం)**

2025- 26 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్(టీజీఎంఎఫ్సీ) ఆధ్వర్యంలో ఆర్థిక సహాయ పథకం కింద రెండు ముఖ్యమైన పథకాలను అమల్లోకి తీసుకొచ్చినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నుషిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

1. తుర్కా కాషా ముస్లిం వర్గానికి టూల్ కిట్లు & జనరేటర్ల పంపిణీ;
రాళ్లు కత్తిరించే వృత్తిలో నిమగ్నమైన పేద తుర్కా కాశా ముస్లిం వర్గానికి చెందిన లబ్ధిదారుల పునరావాసం మరియు జీవనోపాధి మెరుగుదల లక్ష్యంగా టూల్ కిట్లు–జనరేటర్ల పంపిణీ పథకం అమలు చేయబడుతోంది. ప్రతి లబ్ధిదారునికి రూ.60,000/- చొప్పున 100% సబ్సిడీతో ఒకేసారి అందజేస్తారు. ఇందులో రూ.10,000/- విలువైన టూల్ కిట్ మరియు రూ.50,000/- విలువైన జనరేటర్ అందించబడుతుంది. ఈ పథకానికి 21 నుండి 55 సంవత్సరాల మధ్య ఉండాలి.తుర్కా కాశా ముస్లిం కమ్యూనిటీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు తప్పనిసరిగా సమర్పించాలి. గత ఐదు సంవత్సరాలలో తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఎలాంటి ఆర్థిక సహాయం పొందకూడదు.

2. మైనారిటీ యువతకు ఈ - స్కూటర్ల పంపిణీ పైలెట్ ప్రాజెక్టు:
మైనారిటీ యువత(పురుషులు) ఆర్థికంగా బలపడేందుకు మరియు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ-స్కూటర్ల పంపిణీ పైలెట్ ప్రాజెక్టు అమలులో ఉంది. ఈ పథకంలో ఈ-స్కూటర్ యూనిట్ వ్యయం సుమారు రూ. 1.50 లక్షలు కాగా, అందులో 80% సబ్సిడీని(రూ.1.20 /-లక్షలు) ప్రభుత్వం అందిస్తుంది. మిగిలిన 20%(రూ.30,000/-) లబ్ధిదారుల వాటాగా చెల్లించాలి. వయస్సు 21 నుండి 40 సంవత్సరాల మధ్య ఉండాలి. కనీస విద్యార్హత పదవ తరగతి ఉత్తీర్ణత అయి ఉండాలి. డ్రైవింగ్ లైసెన్స్, మరియు పాన్ కార్డు తప్పనిసరి. గత ఐదు సంవత్సరాలలో కార్పొరేషన్ ద్వారా ఎలాంటి ఆర్థిక సహాయం పొందకూడదు. ఎంపికైన లబ్ధిదారులను



ఉబర్ /ఓలా/ రాపిడో వంటి సేవా సంస్థలతో అనుసంధానం చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించబడతాయి. ఈ రెండు పథకాల కోసం ఆన్లైన్ దరఖాస్తులు ఈ నెల 20వ తేదీ నుండి మార్చి 1వ తేదీ రాత్రి 12:00 గంటల వరకు TGOBMMS వెబ్సైట్ https://tsobmms.cgg.gov.in లో స్వీకరించబడతాయని తెలిపారు. జిల్లాలోని అర్హులైన తుర్కా కాశా ముస్లిం మరియు మైనారిటీ వర్గాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నుషిత విజ్ఞప్తి చేశారు.

## జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ ఏర్పాటుకు చర్యలు

**జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్**

**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 21( నినాదం)**

జిల్లాలోని మీడియా ప్రతినిధులకు 2026-28 సంవత్సరాలకు కొత్త అక్రిడిటేషన్ ల జారీ కొరకు నూతన జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ (డీమక్) ఏర్పాటుకు చర్యలు ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్బి .యం.సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.
జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (DMAC)లో సభ్యత్వం పొందేందుకు జి.ఓ. 252 ప్రకారం జిల్లాలోని మీడియా అసోసియేషన్లు, సంఘాలు తమ ప్రతినిధి పేరును లెటర్ ప్యాడ్ పై రాసి ఫిబ్రవరి 24 వ తేదీ ఉదయం 11 గంటల లోపు జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.
1. బిగ్ తెలుగు డైలీ నుండి ఒక ప్రతినిధి.
2. ఉర్దూ డైలీ నుండి ఒక ప్రతినిధి
3. మీడియం డైలీ నుండి ఒక ప్రతినిధి 4. స్మాల్ డైలీ నుండి ఒక ప్రతినిధి
5. ఎలక్ట్రానిక్ మీడియా నుండి ఒక ప్రతినిధి 6. వీడియో జర్నలిస్ట్ నుండి ఒక ప్రతినిధి 7. ఫోటో జర్నలిస్ట్ నుండి ఒక ప్రతినిధి పై సూచించిన ప్రతినిధులు ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 252 లోని రూల్ 3, సబ్ రూల్ 1(సి) ప్రకారం ఫుల్ టైం జర్నలిస్ట్ అయి ఉండాలి. అదే విధంగా బిగ్ డైలీ ప్రతినిధి, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధికి 10 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి, మిగిలిన ప్రతినిధులకు కనీసం 5 సంవత్సరాల మీడియా రంగంలో అనుభవం కలిగి ఉండాలి. నిబంధనల ప్రకారం జిల్లాలోని అసోసియేషన్ లు, సంఘాలు తమ ప్రతినిధుల పేర్లను ఫిబ్రవరి, 24 ఉదయం 11 గంటల లోపు జిల్లా పౌర సంబంధాల అధికారి, జోగులాంబ గద్వాల జిల్లా కార్యాలయంలో అందజేయాలని సూచించారు. గడువు తర్వాత వచ్చిన ఎలాంటి ప్రతిపాదనలు ఎట్టిపరిస్థితుల్లోనూ స్వీకరించబడవని తెలియజేశారు.

## బిజెపి పాలనలో అత్యంత ప్రమాదంలో విద్యారంగం

**ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ ఎ స్టాలిన్. . వచ్చే రాష్ట్ర బడ్జెట్ లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి**

**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 21 (నినాదం) :**

జాతీయ ఉద్యమ ఆకాంక్షలకు, రాజ్యాంగానికి, ఫెడరల్ సూత్రాలకు, ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం 2020 వికసిత్ భారత్ శిక్షా అదిష్టాన్ (విబిఎస్ఎ)-2025 బిల్లు లోపాల పుట్ట అని, ఈ విధానాల ద్వారా విద్య కాషాయీకరణ, కేంద్రీకరణ, కార్పోరేటీకరణ, వ్యాపారీకరణ చేస్తూ అంత్యంత ప్రమాదంలో విద్యారంగాన్ని నెట్టారని, వచ్చే రాష్ట్ర బడ్జెట్ లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గోనెరెడ్డి కళ్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అందరికీ విద్య పేరుతో కొందరికే (కొనగలిగే వారికే) విద్యను పరిమితం చేసిన ఘనత మన పాలకులదని ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని ఆరోపించారు. భారత దేశంలో 90 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏకైక విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్ అని, దేశంలో, రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై నిరంతర విద్యార్థుల పక్షాన నిలుస్తూ ఉద్యమాలు చేస్తున్న సంఘం ఎఐఎస్ఎఫ్ అని తెలిపారు. విద్య వ్యాపారీకరణ వలన ఎస్సి, ఎస్టి, బిసి, ఒబిసి, మైనారిటీలకు సామాజిక న్యాయం దూరమయ్యేలా ఉందని ఆందోళన వ్యక్తంచేశారు.



కేంద్ర బడ్జెట్ లో కనీసం 10 శాతం, జిడిపిలో 6 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని అనేక నివేదికలు చెబుతున్నా బడ్జెట్లో విద్యారంగం వాటా ఏ ఏటికాయేడు కుంచించుకుపోతూ 2.6 శాతంకు తగ్గడం కేంద్రానికి విద్యారంగం పట్ల ఉన్న వివక్షతకు అద్దం పడుతుందని, ఈ కేటాయింపుతో దేశంలో విద్యారంగం ఎలా బాగుపడుతుందని ఎద్దేవా చేశారు. తెలంగాణ నుండి 8మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులున్న తెలంగాణ విద్యార్థులకు కేంద్రం నుండి తీసుకు వచ్చిందేమీ లేదని మండిపడ్డారు. ఫిబ్రవరి 18,19,20వ తేదీల్లో మూడు రోజులపాటు నిజామాబాద్ పట్టణంలోని గోనెరెడ్డి కళ్యాణ మండపంలో జరిగిన ఎఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు విజయవంతంగా ముగిసాయని తెలిపారు.ఈ మహాసభలో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కౌన్సిల్ ను రాష్ట్ర అధ్యక్షుడిగా కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా పుట్ట లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా రెహమాన్, గ్యార క్రాంతి, సోతుకు ప్రవీణ్, బాలసాని లెనిన్, సహాయ కార్యదర్శులుగా ఇటికాల రామకృష్ణ, బానోతు రఘురాం, గ్యార నరేష్, చిట్యాల రాజు, కోశాధికారిగా కాసోజు నాగజ్యోతిలతో పాటు నూతన కౌన్సిల్ సభ్యులుగా 69 మంది, ఆహ్వానితులుగా నలుగురు మొత్తం 73 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు పి.సుధాకర్, ఒమయ్య, ఎఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుభోద్, బానోతు రఘురాం, జిల్లా సహాయ కార్యదర్శి కుషాల్, జిల్లా కోశాధికారి అనూష, నాయకులు కిషోర్, రమేష్, దినేష్, రిహాన్ తదితరులు పాల్గొన్నారు.

## అశ్వాపురం గ్రామాభివృద్ధిపై పంచాయతీ సమీక్ష సమావేశం

**అశ్వాపురం, ఫిబ్రవరి 21, (నినాదం):**

అశ్వాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం నాడు ఉప సర్పంచ్ తుళ్లూరు ప్రకాష్ అధ్యక్షతన వార్డు సభ్యుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు, వీధి దీపాల నిర్వహణ తదితర విషయాలను సమీక్షించారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పైప్లైన్ మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి దాసరి మల్లేశం, వార్డు సభ్యులు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.







## పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో 'పోస్ట్' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహం

**మెట్‌పల్లి ఫిబ్రవరి 21 ( నినాదం)**

పెద్దాపూర్ ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ (పోస్ట్) సభ్యులు శనివారం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించి, ఇంటర్ మరియు పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాబోయే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావడానికి పాటించాల్సిన మెళకువలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమయ పాలన, పునశ్చరణ పద్ధతులు, ప్రశ్నాపత్రం నిర్వహణలో పాటించాల్సిన విధానాలపై విలువైన సూచనలు అందించారు.గత సంవత్సరం పదో తరగతిలో మొదటి ర్యాంక్ సాధించిన పి. సిద్ధార్థకు రూ.10,000 నగదు బహుమతి అందజేశారు. అదేవిధంగా గత ఏడాది ప్రతి తరగతిలో ప్రథమ శ్రేణి సాధించిన విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, షూలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి మరియు ఇంటర్ పబ్లిక్ పరీక్షలు రాయబోయే విద్యార్థులకు పరీక్షా సామాగ్రి కూడా అందించారు.విద్యార్థులు క్రమశిక్షణతో, ఐక్యతతో ముందుకు సాగుతూ మంచి ఫలితాలు సాధించాలని, అవసరమైతే తమ వంతు సహకారం అందిస్తామని పోస్ట్ సభ్యులు తెలిపారు.




## ఆరె కుల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం

**ఐకమత్యంతో ముందుకు –సామాజిక సేవే ప్రధాన లక్ష్యం**

**నల్లబెల్లి, ఫిబ్రవరి 21 (నినాదం):**

వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నందిగామలో ఆరె కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కుల పెద్దమనిషి కుల పెద్దలు సమక్షంలో నిర్వహించిన ముఖ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశం సౌహార్ద వాతావరణంలో జరిగి, సంఘ అభివృద్ధి, యువతకు మార్గదర్శనం, విద్యా ప్రోత్సాహం సామాజిక ఐక్యత వంటి అంశాలపై చర్చించారు.సభలో సభ్యులందరూ ఏకగ్రీవంగా క్రింది విధంగా బాధ్యతలను కేటాయించారు.అధ్యక్షులు ఇంగోలి రాజేష్,ఉపాధ్యక్షులు మోర్తాల రఘుపతి ప్రధాన కార్యదర్శి, గాజులపాటి కిషన్ రావు సహాయ కార్యదర్శులు: మోరె సతీష్, తిమ్మాపురం శివ కోశాధికారి: దుర్గనాల రాజుకమిటీ సభ్యులు, కొల్లూరి రాజు, వడిజె తరుణ్, డుకిరే నవీన్, నాగులగాని శ్రీనివాస్, చెట్టుపెల్లి రాజేందర్, వర్నె యువరాజ్, వరికెల శ్రీకాంత్, వాడు కారి హరీష్. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ఇంగోలి రాజేష్ మాట్లాడుతూ, సంఘ అభివృద్ధి కోసం అందరి సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు. యువతకు ఉపాధి, విద్య, సామాజిక చైతన్యం పెంపొందించే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కుల పెద్దలు నూతన కమిటీకి అభినందనలు తెలియజేస్తూ, ఐకమత్యంతో పనిచేస్తే సంఘం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సమావేశం చివరలో సభ్యులందరూ సంఘ సంక్షేమానికి కట్టుబడి పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు.



## మిత్రుడి కూతురి వివాహానికి సహాయం

**కరీంనగర్, ఫిబ్రవరి 21(నినాదం )**

బాల్యమిత్రుడు కూతురు వివాహానికి స్నేహితులు అండగా నిలిచారు. 1997- 98 పదవ తరగతి బ్యాచ్ కి చెందిన రామడుగు మండలం గోపాల్ రావు పేట వాస్తవ్యుడు బొల్లిపెల్లి శ్రీనివాసు కొద్ది సంవత్సరాల క్రితం మృతి చెందాడు. పేద కుటుంబం కావడంతో బాల్య మిత్రులందరు శనివారం జగిత్యాల లో జరిగిన స్నేహితుడి కూతురూ సాక్షిత- వినయ్ వివాహానికి హాజరై ఆర్థిక సహాయం అందించారు. 41, 516 నగదును అందజేసి వధూ వరులను ఆశీర్వదించారు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి పీపే కొండా పరశురామ్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్నేహితులు ఎండి జాకీర్ హుస్సేన్ గంగాధర రమేష్ బాబు, మందల శ్రీనివాస్ రెడ్డి నరేందర్ రెడ్డి బోనగిరి కొండాల్ ఇనుగుర్తి వెంకటేశ్వర్లు మడ్డి శ్రీనివాస్ గర్వందుల అంజయ్య కాల్వ నాగరాజ్ దూలం మహేష్ గౌడ్ చాడ ప్రేమ్ చందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

**నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య**






**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 21 (నినాదం) :**

అన్ని మతాల పండుగలను ప్రతీ ఒక్కరూ శాంతియుతం గా నిర్వహించుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని మతాల పెద్దలతో పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్ లో రాబోయే ఉగాది, హోలీ, రంజాన్ పండుగలను దృష్టిలో పెట్టుకొని సీపీ అధ్యక్షతన శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రారంభం కావడంతో శాంతిభద్రతల పరిరక్షణ కోసం హిందూ, ముస్లిం మత పెద్దలు, ఇతర సామాజిక ప్రతినిధులతో జిల్లా గంగా-జమునా తెహజీబ్‌కు ప్రతీక అని, అన్ని మతాల వారు సోదరభావంతో ఉండాలని కోరారు. పవిత్ర రంజాన్ మాసంలో మసీదుల వద్ద ప్రార్థనల సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఈ పండుగ వేళ అందరూ శాంతియుతంగా సహకరించాలని కోరారు. ఎవరికి ఎలాంటి సమస్య వచ్చిన సంబంధిత పోలీస్ స్టేషన్ వారిని సంప్రదించాలని లేదా డయల్ 100ను సద్వినియోగపరచుకోవాలని తెలిపారు. ఈ శాంతి కమిటీ సమావేశంలో పాల్గొన్న మత పెద్దల మాటను మీ కాలనీలలో ఉండే ప్రజలు వింటారని, మీరు తెలిపే ప్రతి విషయము సమ్యమానంగా ఉండే విధంగా తెలియజేయాలని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల కోసం తీసుకుంటున్న ఇతర చర్యల గురించి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ(అడ్మిన్) జి. బస్వా రెడ్డి, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్ ఏసిపిలు ప్రకాష్, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, సిఐలు, జిల్లా లోని అన్ని మతాల మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నులు పంపిణీ

**మల్హర్ ఫిబ్రవరి 21 (నినాదం):**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు సంపత్ రావు, ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ మరియు పెన్నులు పంపిణీ చేయడం జరిగింది. హ్యూమన్ రైట్స్ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు చదువు రానించి పరీక్షలు బాగా రాసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ రాజేందర్,మహిళా విభాగం అధ్యక్షురాలు మంజుల రెడ్డి సభ్యులు అశోక్,ప్రసాద్, కుమార్,రాజాబాపు,అశోక్,నాగరాజు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు




## దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్‌లో 37 దరఖాస్తులు స్వీకరణ





**జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు**

**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 21 ( నినాదం)**

శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ ఆదేశాల మేరకు దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు పాల్గొని, దివ్యాంగులతో దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ ప్రత్యేక గ్రీవెన్స్ లో 37 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వారి సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా పరిపాలన యంత్రాంగం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్నప్పటికీ, దివ్యాంగుల ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. అర్హులైన దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లతోపాటు ఇతర సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి, అర్హులైన దివ్యాంగులకు వేగవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇక నుంచి ప్రతి నెల మూడో శనివారం దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

## తెలుగు భాష గొప్పతనం సాహిత్య సేవలను కొనియాడిన అదనపు జిల్లా కలెక్టర్ నరసింహారావు





**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 21( నినాదం)**

శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం★ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని MLAD డిగ్రీ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీ బి. నర్సింగ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలేజీలో ఏర్పాటు చేసిన తెలుగు రచయితల ఫోటో ప్రదర్శన (ఎగ్జిబిషన్) ను పరిశీలించి, తెలుగు భాష గొప్పతనం మరియు ప్రముఖ రచయితల సాహిత్య సేవలను కొనియాడారు. అనంతరం కాలేజీ లైబ్రరీని తనిఖీ చేసి, విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని, పోటీ పరీక్షలకు సంబంధించిన గ్రంథాలు కూడా ఏర్పాటు చేయాలని యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ కలందర్ గారు, తెలుగు అధ్యాపకులు హరి నాగభూషణం గారు, ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# నినాదం

## తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం
22 ఫిబ్రవరి
2026


## అగ్నిప్రమాదాల నివారణకు స్వచ్ఛ ఆటో కార్మికులు సహకరించాలి

### బాలానగర్ ఏసీపీ



**రంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 21 (నినాదం) :** రోడ్ల పక్కన పేరుకుపోతున్న వ్యర్థాలకు నిప్పంటించడం వల్ల ఇటీవల అగ్నిప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో, బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు స్వచ్ఛ ఆటో కార్మికులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో జీహెచ్ఎంసీ తరపున ఎస్ఎఫ్ఓ నాగరాజు పాల్గొని, పారిశుద్ధ్య నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లపై చర్చించారు. ముఖ్యంగా రోడ్ల వెంట కుప్పలుగా పేరుకుపోయిన చెత్తకు నిప్పు అంటుకోవడం వల్ల ప్రమాదాలు వాటిల్లే ముప్పుందన్నారు. స్వచ్ఛ ఆటో కార్మికులు చెత్తను రోడ్ల పక్కన వేయకుండా, ఎప్పటికప్పుడు నిర్దేశిత డంపింగ్ పాయింట్లకు తరలించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో అగ్నిప్రమాదాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజా రక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న ఇతర క్షేత్రస్థాయి సమస్యలను కూడా ఈ సమావేశంలో చర్చించి, వాటి పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. పారిశుద్ధ్య కార్మికులు బాధ్యతగా పనిచేసి అగ్నిప్రమాద రహిత సమాజం కోసం సహకరించాలని ఆయన కోరారు.

## శ్రీనిధి రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

### మున్సిపల్ చైర్మన్ సుధా బాలకృష్ణ



**మిర్యాలగూడ ఫిబ్రవరి 21ని (నినాదం) :** శ్రీనిధి రుణాల వసూలు విషయంలో వార్డు ఆఫీసర్స్, మెప్మా రిసోర్స్ పర్సన్స్ ప్రత్యేక దృష్టి పెట్టి రికవరీ చేయాలని మునిసిపల్ చైర్మన్ చిలుకూరు సుధా బాల కృష్ణ కోరారు. శనివారం స్థానిక మున్సిపల్ సమావేశ మంది రంలో శ్రీనిధి రివ్యూ మీటింగ నిర్వహించారు. శ్రీనిధి జోనల్ మేనేజర్ అనంత కిషోర్ మాట్లాడుతూ శ్రీనిధి ప్రతి ఒక్క మహిళా సంఘానికి అత్యవసరానికి లోన్లు ఇస్తున్నదని దీని ద్వారా 200 మంది మహిళా డ్రైవర్లు పనిచేస్తున్నారని అన్నారు. అదేవిధంగా ఫుడ్ ప్రాసెసింగ్ య్యూనిట్స్ కూడా పెట్టుకున్నట్లయితే మహిళా సంఘాలకు శ్రీనిధి రుణాలు ఇస్తామని అన్నారు. రికవరీ కల్చర్ లేకపోవడం వల్ల శ్రీనిధిలో బకాయిలు పెరుగుతున్నాయన్నారు. అందరు 100శాతము శ్రీనిధి రికవరీ ఉండాలని తెలిపారు. ఏప్రిల్ నుంచి నూతనంగా కొత్త ఎంటర్ప్రైజెస్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదేవిధంగా లోన్ తీసుకొని చనిపోయిన సభ్యులకు కట్టిన అమౌంట్ తిరిగి వాపసు ఇస్తామని తెలియజేశారు. యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పేరు మీద మార్చి 31 వరకు 100శాతం రికవరీ చేసి పది లక్షల రూపాయల వరకు వారికి ఇన్సూరెన్స్ చెల్లిస్తామని దీని ద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. సోలార్ సిస్టం వాళ్లకు కూడా మహిళా సంఘాలకు రుణము ఇస్తామన్నారు. తీసుకున్న రుణము సక్రమంగా చెల్లిస్తే ఆ సంఘాలకు ఇన్సెంటివ్ కూడా ఇస్తామన్నారు. ముఖ్యంగా మార్చి 31 వరకు శ్రీనిధి బకాయిలు మొత్తము పూర్తిగా క్లియర్ చేయాలన్నారు. శ్రీనిధి బకాయి విషయంలో ఎవరైనా వ్యక్తిగతంగా వాడుకున్నట్లయితే వారి పైన ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం చేయడం జరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ వార్డ్ ఆఫీసర్లు ప్రతిరోజు ఒక గంట పాటు మెప్మా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. అదేవిధంగా మిర్యాలగూడ పట్టణంలో బ్యూటీ పార్లర్సు నిర్వహించేవారు 55 మంది 70 లక్షల శ్రీనిధి రుణము తీసుకున్నారని తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలో బ్యూటీ పార్లర్సు నిర్వహించేవారు 55 మంది ఉండి వారు 70 లక్షల శ్రీనిధి రుణము తీసుకున్నారన్నారు. కమ్యూనిటీ కామన్ కమ్యూనిటీ కిచెన్ సెంటర్లు పెండ్లిలకు పార్కుల వద్ద బ్రేక్ఫాస్ట్ స్నాక్స్ క్యాంపు సుందరయ్య పార్క్ దగ్గర వాకర్స్ ఉంటారు వాళ్లకు డ్రై ఫ్రూట్స్ లాంటివి ఎంకరేజ్ చేసి మహిళా సంఘాల మహిళలు వ్యాపారాలు చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఆస్తిపన్ను వసూలుకై ప్రతి ఇంటికి నోటీసు సర్వ్ చేయాలని మార్చి 31 వరకు 100% ప్రాపర్టీ టాక్స్ వసూలు చేయాలన్నారు. సమావేశంలో మున్సిపాలిటీ మేనేజర్ జ్ఞానేశ్వరి డిఆర్డిఎ ఏపిడి శ్రవణ్ కుమార్ ,శ్రీనిధి రీజనల్ మేనేజర్ శ్రీలేఖ మెప్మా టిఎంసి బక్కయ్య సిఓ శ్రీనివాస్ వెంకటేశ్వర్లు, సతీష్, శ్రీనిధి మేనేజర్ సుధాకర్ అసిస్టెంట్ మేనేజర్లు మల్లేశ్వరి, ఉమా వార్డ్ ఆఫీసర్లు రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

## కొంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం



**మునుగోడు, ఫిబ్రవరి 21 (నినాదం):** మునుగోడు మండలం, కొంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో,ప్రధానోపాధ్యాయులు గూడపూర్ వెంకటనారాయణ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మాతృభాష దినోత్స వం ఘనంగా నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు గేర నరసింహ పాల్గొన్నారు అనంతరం వారు మాట్లాడుతూ, యునెస్కో ఆధ్వర్యంలో 1999వ సంవత్సరంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం గుర్తించడం జరిగిందని తెలిపారు. యునైటెడ్ నేషన్స్ సైంటిఫిక్ అండ్ కల్చర్ ఆర్గనైజేషన్ అనే సంస్థ 1952 ఫిబ్రవరి 21 తారీఖున అప్పటి తూర్పు పాకిస్తాన్ నేడు బంగ్లాదేశ్ విద్యార్థులు ఒక ఉద్యమాన్ని చేశారని దానిలో అనేక మంది విద్యార్థులు బలయ్యారని దాన్ని సూచకంగా, అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ప్రకటించారని వారు తెలిపారు. తెలుగు భాష ఒక గొప్పతనాన్ని ఆనాటి శ్రీకృష్ణదేవరాయలు దేశ భాషలందు తెలుగు లెస్స అని కొనియాడిన సందర్భాన్ని గుర్తు చేయడం జరిగింది. అంత గొప్ప తెలుగు భాషను ఈనాడు కనుమరుగు చేసే పరిస్థితి కనిపిస్తుందని కొన్ని రోజుల తర్వాత తెలుగు భాష అంతమయ్యే ప్రమాదం ఉందని అందుకే ప్రతి ఒక్కరూ తెలుగు భాషను నేర్చుకొని, దానిలో ఉన్న గొప్పతనాన్ని తెలుసుకోవాలని అమ్మ అని పిలిచే పిలుపులో ఉన్న గొప్పతనం మమ్మీ డాడీ లో ఉండదని అంత గొప్ప తెలుగు భాషను తులనాడ వద్దని కోరారు. ప్రభుత్వాలు కూడా తగిన చర్యలు తీసుకొని మాతృభాష అభివృద్ధికి కృషిచేసి తెలుగు భాషను అభివృద్ధి పరచాలని అన్నాడు. ఈ కార్యక్రమంలో, ఉపాధ్యాయులు బాలరాజు, వి జయలక్ష్మి, పద్మావతి, నాగమణి, జ్యోతి, సతీష్ కుమార్, కోటయ్య రేణుక, ధనలక్ష్మి, శైలజ తదితరులు వారు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల కమిటీ ఏర్పాటు చేస్తామనడం హర్షనీయం

### ఉద్యమకారుల ఫోరం... జవహర్ నగర్ అధ్యక్షుడు సుధాకర్ చారి



**జవహర్ నగర్, ఫిబ్రవరి 21( నినాదం):** ఉద్యమకారుల కమిటీ ఏర్పాటు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలపడం హర్షణీయమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జవహర్ నగర్ అధ్యక్షుడు సుధాకర్ చారి అన్నారు. మల్కాజిగిరి జోనల్ పరిధి జవహర్ నగర్ లో తెలంగాణ ఉద్యమకారుల జవహర్ నగర్ అధ్యక్షుడు సుధాకర్ చారి ఆధ్వర్యంలో శనివారం ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ చారి మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యమకారుల పోరాటం చిరస్థాయిగా నిలుస్తుందని అర్హులైన వారికి 250 గజాల ఇంటి స్థలం అందజేయాలని అన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ కు జవహర్ నగర్ ఉద్యమకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, పరుశురాం, ఎల్లస్వామి, నరసింహ, పుష్ప, అనంతలక్ష్మి, అరుణ, మహేష్, భాస్కర్, ఆకుల నరసయ్య, సత్యనారాయణ, సంతోష్ కుమార్, బాలరాజ్, రామచంద్ర యోగి, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రసాయన ఎరువుల వినియోగంలో జాగ్రత్త అవసరం

### మిర్చి రైతులకు అవగాహన సదస్సులో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పిలుపు

### నాణ్యమైన మిర్చికే మార్కెట్లో మంచి ధర

### కలెక్టర్ డా. సత్య శారద




**నల్లబెల్లి, ఫిబ్రవరి 21 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం వ్యవసాయంలో రసాయన ఎరువుల అధిక వినియోగం భూసారాన్ని దెబ్బతీసి భవిష్యత్ దిగుబడులపై ప్రభావం చూపుతుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. శనివారం నల్లబెల్లి మండలం కొండాయిలపల్లి గ్రామంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మిర్చి రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమతుల్య ఎరువుల వినియోగం, మట్టి పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మాత్రమే రైతులు స్థిరమైన దిగుబడులు సాధించగలరన్నారు. అధిక రసాయన ఎరువులు వాడటం వల్ల మట్టిలో జీవపదార్థాల శాతం తగ్గి భూసారం క్షీణిస్తుందని హెచ్చరించారు. మిర్చి కోత అనంతరం మార్కెట్‌కు తీసుకువెళ్లే సమయంలో తేమ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తేమ అధికంగా ఉంటే కాయ రంగు మారి నాణ్యత తగ్గి ధరపై ప్రభావం పడుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు తీసుకువచ్చే మిర్చి శాస్త్రవేత్తలు సూచించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉంటే మంచి ధర లభిస్తుందని చెప్పారు. రకాల వారీగా ధరలను ఎలక్ట్రానిక్ బోర్డులపై ప్రదర్శించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైతులు ధరల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ రాజకుమార్ విదేశీ ఎగుమతులకు అవసరమైన ప్రమాణాలు, మిర్చి ఆరబెట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధిక దిగుబడులకు అనుసరించాల్సిన సమగ్ర యాజమాన్య విధానాలపై వివరించారు. జిల్లా యంత్రాంగం, మార్కెటింగ్, ఉద్యాన, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా రైతులకు మార్గదర్శకాలు జారీ చేశాయి. మిర్చి బస్తాలను 49 కిలోల లోపు నింపాలని, తేమశాతం 10--12 శాతం మధ్య ఉండేలా చూసుకోవాలని సూచించారు. తాలు మిర్చి, పండు కాయలను వేరు చేసి తీసుకువస్తే పోటీ ధర లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ ఎరుకల స్వప్న, జిల్లా వ్యవసాయ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, మార్కెట్ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ గాయత్రి మాత దేవాలయంలో ఆదివారం యంత్ర హోమం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



**దుబ్బాక,ఫిబ్రవరి 21 (నినాదం) :** సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పరిధిలోని రామక్కపేట, ధర్మాజీపేట,చౌదరిపల్లి, శివారుల్లోని ఆకారం రోడ్డులో నూతనంగా ఏర్పడిన శ్రీ గాయత్రి మాత దేవాలయంలో శనివారం రెండవ రోజు యంత్ర హోమం,విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. వేద పండితులు,పూజారుల చేత జలది హోమాలు యజ్ఞ హోమం, పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం రోజు యజ్ఞ హోమాలు,పూజలు,అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతయాని. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు హాజరువుతున్నట్లు తెలిపారు. చుట్టూ ప్రక్కల గ్రామాల వారు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వేద పండితులు కృష్ణ హంస స్వామి ఆచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు సుంకోజీ మనోజ్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రి మాత దేవాలయ సభ్యులు,గురుస్వాములు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ వేళ పటిష్ట భద్రత

### కేపీహెచ్‌బీలో శాంతి కమిటీ సమావేశం



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 21 (నినాదం) :** రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టరు రాజశేఖర్ రెడ్డి కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ ప్రతినిధులతో ఆయన ఈరోజు శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ప్రార్థనలకు వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పండుగను సోదరభావంతో జరుపుకోవాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే తక్షణమే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మత పెద్దలు పోలీసులతో సమన్వయం పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ మసీదుల కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కంటి చూపుకు కవచం కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**11 విడతల్లో 8424 మందికి కంటిపరీక్షలు,1747 మందికి కంటి ఆపరేషన్లు పూర్తి, 3427 మందికి కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ**

**మునుగోడు నియోజకవర్గంలో నిరంతరాయంగా కొనసాగుతున్న ఉచిత కంటి వైద్య శిబిరాలు**

**12వ, విడత ఉచిత కంటి వైద్య శిబిరం**







**మునుగోడు, ఫిబ్రవరి 21 (నినాదం):** మునుగోడు నియోజకవర్గ ప్రజల కంటిచూపుకు కవచంగా మారారు మునుగోడు శాసనసభ్యులు. కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి .తన నియోజకవర్గం మునుగోడు లో నిరంతరాయంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, వేలాది మంది కంటి చూపుకు ఆశాకిరణంగా మారారు. కంటి చూపు తో ఇబ్బంది పడుతున్న వృద్దులు, మహిళలు, వయోజనులకు కంటి ఆపరేషన్లు చేయిస్తూ...కంటి ఆపరేషన్ అవసరం లేని వారికి కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. పేదోళ్ల కండ్లలో వెలుగులు చూడాలనే తలంపుతో తానే పెద్దకొడుకుగా మారి తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా మొదలైన ఉచిత కంటి వైద్య శిబిరాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి..ఇప్పటికే ఏడు మండల కేంద్రాలలో రెండు మున్సిపాలిటీలలో వైద్య శిబిరాలు,పూర్తయ్యాయి. మునుగోడు మండల ప్రజలకు మరోమారు ఉచిత వైద్య శిబిరం నిర్వహణ,పూర్తయింది. (22-02-2026, ఆదివారం) రోజున చండూరు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలతో పాటు చండూరు మున్సిపాలిటీలో ఉన్న పది వార్డుల ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 11 విడతలుగా ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి 8424 మందికి కంటి పరీక్షలు చేయించి,1747 మంది కి కంటి ఆపరేషన్లు పూర్తిచేసి,3427 మందికి కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు.. మునుగోడు మండల ప్రజలకు మునుగోడు లో నిర్వహించి న మొదటి విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 216 మందికి, రెండవ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 108 మందికి, చండూరు మున్సిపాలిటీ ప్రజలకు మునుగోడు లో నిర్వహించిన మూడవ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 129 మందికి, నాంపల్లి మండల ప్రజలకు నాంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన నాలుగవ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 229 మందికి, మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించిన ఐదవ విడత కంటి వైద్య శిబిరంలో 171 మందికి, చండూరు మండల ప్రజలకు బంగారిగడ్డ గ్రామంలో నిర్వహించిన ఆరవ విడత వైద్య శిబిరంలో 198 మందికి, ఘట్టుప్పల్ మండల కేంద్రంలో నిర్వహించిన ఏడవ విడత వైద్య శిబిరంలో 65 మందికి, నారాయణ్ పూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఎనిమిదవ విడత వైద్య శిబిరంలో 132 మందికి, చౌటుప్పల్ మున్సిపాలిటీలో నిర్వహించిన తొమ్మిదవ విడత వైద్య శిబిరంలో 82 మందికి , చౌటుప్పల్ మండల ప్రజలకు లక్కారంలో నిర్వహించిన పదవ విడత వైద్య శిబిరంలో 160 మందికి కంటి ఆపరేషన్లు పూర్తి చేశారు. తిరిగి రెండవ సారి మునుగోడు మండల కేంద్రంలో నిర్వహించిన పదకొండవ విడత వైద్య శిబిరంలో 257 మందికి కంటి ఆపరేషన్లు పూర్తిచేశారు. మళ్లీ ఆదివారం చండూరు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు , చండూరు మున్సిపాలిటీ లోని పది వార్డుల ప్రజలకు మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో 12 వ, విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. రాబోయే మూడు సంవత్సరాలలో నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కూడా కంటి సమస్యతో బాధపడకుండా ఉండాలని ప్రణాళిక రూపొందించారు. ఆ ప్రణాళికలో భాగంగానే 10 వేల మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయించేలా టార్గెట్ పెట్టుకున్నారు. దాంట్లో భాగంగానే, (22-02-2026) ఆదివారం చండూరు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలతో పాటు మున్సిపాలిటీ లోని పది వార్డుల ప్రజలకు మునుగోడు లోని క్యాంపు కార్యలయం వద్ద 12 వ, విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు..తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. చండూరు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, మున్సిపాలిటీలోని పది వార్డుల ప్రజలు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఇప్పటికే గ్రామాలలో, మున్సిపాలిటీలో టామ్ టామ్ వేయించి ప్రచారం నిర్వాహించారు స్థానిక నాయకులు.

## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

### చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి పామేన భీమ్ భరత్.

**చేవెళ్ల ఫిబ్రవరి21 (నినాదం):** కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం అభివృద్ధి సాధ్యమవుతుందని చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి పామేన భీమ్ బారత్ అన్నారు. శనివారం చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండల పరిధిలోని రుద్రారం గ్రామం నుండి బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి గారెల ప్రవీణ్ కుమార్ ముదిరాజ్, అతని అనుచరులతో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ప్రామేన భీమ్ భరత్ ఆధ్వర్యంలో చేరారు. అనంతరం వారిని పార్టీలోకి ఆహ్వానించి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సంక్షేమం సాధ్యమవుతుందని, అన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోతుగల్ గ్రామ సర్పంచ్ పామిన నర్సింలు, వివిధ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం
22 ఫిబ్రవరి
2026

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

**గ్రామ సర్పంచ్ జుట్టు రామస్వామి, వెంకటేష్ బాబు**

**అంతారం గ్రామ పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్**

**చేవెళ్ల ఫిబ్రవరి 21( నినాదం) :** విద్యా అభివృద్ధిపై సమగ్ర చర్చ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పోషకాహారం అందించాలని గ్రామ సర్పంచ్ గుట్ట రామస్వామి, అన్నారు. శనివారం చేవెళ్ల మండలం అంతారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత మరియు ప్రాథమిక పాఠశాలలో శనివారం పేరెంట్స్ మీటింగ్ ప్రధానోపాధ్యాయులు రామారావు అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, పాఠశాలల అభివృద్ధి, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా ఈ సమావేశం ఏర్పాటుచేసారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ జుట్టు రామస్వామి, ఉపసర్పంచ్ వెంకటేష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరై సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జుట్టు రామస్వామి మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తు వారి చదువులపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పాఠశాలలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని సూచించారు. ఉపసర్పంచ్ వెంకటేష్ బాబు



మాట్లాడుతూ... గ్రామ అభివృద్ధికి విద్యే ప్రధాన ఆధారం అని ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల హాజరు శాతం, ఇటీవల నిర్వహించిన పరీక్షల ఫలితాలు, బోధన విధానాలు మరియు పాఠశాలలో అమలవుతున్న పథకాల గురించి వివరించారు. విద్యార్థుల ప్రగతి నివేదికలను తల్లిదండ్రులకు అందజేసి, వారి అభిప్రాయాలను స్వీకరించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న



సమస్యలు, అవసరమైన సదుపాయాల గురుంచి చర్చించారు అదేవిధంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సర్పంచ్ మరియు ఉపసర్పంచ్ పరిశీలించారు. ఆహార నాణ్యత, మెనూ అమలు వంటి అంశాలను తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం రుచి, నాణ్యతపై విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# సామ్రాజ్యవాద విధానాలపై పోరాడాలి

**సిపిఎం రాష్ట్ర నాయకులు ఉడత రవీందర్ పిలుపు**



**నిర్మల్ ప్రతినిధి, ఫిబ్రవరి 21.( నినాదం):** అమెరికా అనుసరిస్తున్న సామ్రాజ్యవాద విధానాలు ప్రపంచ శాంతికి, అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక స్వయంప్రతిపత్తికి పెను సవాలుగా మారాయని సిపిఎం రాష్ట్ర నాయకులు ఉడత రవీందర్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో రెడ్ బుక్ డే సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక అధ్యయన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బరితెగించిన అమెరికా సామ్రాజ్యవాదం అనే పుస్తకాన్ని జిల్లా నాయకులతో కలిసి ఆయన పఠించారు. ఈ క్రమంలో రవీందర్ గారు మాట్లాడుతూ ఫిబ్రవరి 21న జరుపుకునే రెడ్ బుక్ డే ప్రాధాన్యతను కార్యకర్తలకు వివరించారు. అమెరికా తన ఆధిపత్యం కోసం అనుసరిస్తున్న ఆర్థిక మరియు రాజకీయ పరిణామాలు పేద దేశాలపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో ఆయన సోదాహరణంగా విశ్లేషించారు. సామ్రాజ్యవాద శక్తులను ప్రతిఘటించడంలో ప్రజాస్వామ్య ఉద్యమాలు మరియు వామపక్ష భావజాలం కీలక పాత్ర పోషిస్తాయని ఆయన స్పష్టం చేశారు. ?సమకాలీన సామాజిక పరిస్థితులపై సరైన అవగాహన పెంపొందించుకోవడానికి మార్క్సిస్టు సాహిత్య అధ్యయనం ఎంతగానో తోడ్పడుతుందని ఈ సందర్భంగా చర్చించారు. పుస్తక పఠనం ద్వారానే కార్యకర్తలు సిద్ధాంతపరమైన స్పష్టతను పొందగలరని, ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయగలరని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ తో పాటు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ మరియు బానోతు సుజాత పాల్గొన్నారు

# కుష్టు వ్యాధిగ్రస్తులను ప్రేమతో ఆదరించాలి

**మానవ హక్కుల కమిషన్**

**ప్రతినిధి డాక్టర్ ప్రదీప్ కుమార్ నాయక్**

**జవహర్ నగర్, ఫిబ్రవరి 21 (నినాదం):** కుష్టు వ్యాధిగ్రస్తులను ప్రేమతో ఆదరించాలని అవగాహన పెంచుకోవడంతోనే వ్యాధిని నివారించవచ్చునని జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రతినిధి డాక్టర్ ప్రదీప్ కుమార్ నాయక్ అన్నారు. మల్కాజిగిరి జోనల్ పరిధి జవహర్ నగర్ లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రతినిధి ప్రదీప్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం వైద్య సిబ్బంది ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ నాయక్ మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆహార అలవాట్లలో శ్రద్ధ తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లెప్రసీ అధికారి డాక్టర్ జానుబాబు, అదనపు వైద్యాధికారి



డాక్టర్ సత్యవతి, జిల్లా అధికారి శ్రీదేవి, డాక్టర్లు చంద్రకళ, విజయచంద్ర, డిఎంహెచ్ ఓ, పారా మెడికల్ సిబ్బంది ఫాతిమా, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# రేలకుంటలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

**ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం**





**నల్లబెల్లి, ఫిబ్రవరి 21 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని రేలకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన మినరల్ వాటర్ ప్లాంట్‌ను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో శుద్ధి చేసిన తాగునీటి సౌకర్యాలు కల్పించడం ప్రజా ఆరోగ్య పరిరక్షణలో కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి దిశగా పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, ప్రతి గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపరచడానికి కృషి కొనసాగుతుందని తెలిపారు. గ్రామస్తులు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఇకపై స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండడంతో ఆరోగ్య సమస్యలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల తిరుపతిరెడ్డి, రేలకుంట గ్రామ సర్పంచి మండల నాయకులు, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పాల్గొన్నారు.



# బాచుపల్లి పెద్ద చెరువులో మురికినీరు కలవకుండా వెంటనే చర్యలు తీసుకోవాలి

**ఆకుల సతీష్**



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 21 (నినాదం) :** నిజాంపేట్ సర్కిల్ బాచుపల్లి గ్రామంలో సుమారు 42 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన అతిపెద్ద మంచినీటి వనరైన భైరవాన్ కుంట (పెద్ద చెరువు) గత వారం రోజులుగా తీవ్ర కాలుష్యానికి గురవుతోంది. ఇంద్రానగర్, రెడ్డి స్లాబ్, ఎస్‌విఎస్‌ఆర్ వన్, కేజీఎం కాలనీల నుంచి వచ్చే నాలుగు డ్రైనేజ్ మాన్యువల్స్ పగిలిపోవడంతో మురికినీరు నేరుగా చెరువులోకి చేరుతోంది. దీంతో మంచినీటి చెరువు క్రమంగా మురికినీటి చెరువుగా మారుతోంది. ఈ విషయంపై గత పది రోజులుగా మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో స్థానిక ప్రజలకు ఆందోళన కలిగిస్తుందని ఆకుల సతీష్ తెలిపారు. మురికినీరు చెరువులో కలవడం వల్ల భూగర్భ జలాలు కలుషితమై నీటి కాలుష్యం ఏర్పడే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. పెద్ద చెరువు పరిసర ప్రాంతాల్లో దుర్వాసన, దోమల బెడద వల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హిందువుల పవిత్రమైన వినాయక నిమర్జనం జరిగే ఈ ఏకైక మంచినీటి చెరువు కలుషితం కావడం బాధాకరమన్నారు. ప్రస్తుత పరిస్థితిపై నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆకుల సతీష్ ఆరోపించారు. తక్షణమే డ్రైనేజ్ మాన్యువల్స్ మరమ్మతు చేసి మురికినీరు చెరువులోకి చేరకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్, హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు మాన్యువల్స్‌ను ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేస్తున్నారని సమాచారం ఉన్నందున చెరువు పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి బాచుపల్లి పెద్ద చెరువును పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

# మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ లో విద్యార్థికి అవార్డు



**జమ్మికుంట, ఫిబ్రవరి 22 (నినాదం) :** జమ్మికుంట మండలంలో శనివారం రోజున మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. ఈ టాలెంట్ టెస్ట్ లో మండలంలోని 12 ఉన్నత పాఠశాలల విద్యార్థులు టెస్టుకు హాజరయ్యారు. ఈ సెన్స్ టాలెంట్ టెస్టులో జమ్మికుంట (బాలురు) ఉన్నత పాఠశాల విద్యార్థి మిడిదొడ్డి సాయి క్రిష్ణ

**అవని నుండి అంతరిక్షం వరకు అంతా సైన్స్ మయం**

**బాలుర ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాదం సురేష్**

తదనంతరం జమ్మికుంట మండలం ఫిజిక్స్ ఫోరం అధ్యక్షులు ఎం.స్వామి మాట్లాడుతూ అవని నుండి అంతరిక్షం దాకా అంతా సైన్స్ తో ముడిపడి ఉందని, సైన్స్ అంటేనే కృత్యాలు, ప్రయోగాలు, అన్వేషణలు చేయడం అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సామాజిక రుగ్మతలను రూపుమాపుతూ సైన్స్ సబ్జెక్టులో విద్యార్థులందరూ రాణించాలని కోరారు. సైంటిస్టుల జీవితగాథలను పఠిస్తూ వారిని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మండలం ఫిజిక్స్ ఫోరం టీచర్లు సంతోష్ కుమార్, యం. స్రవంతి మేడం సూచించారు. విజేత యం. సాయి క్రిష్ణ రెండవ స్థానంలో నిలవడంతో జమ్మికుంట (టౌన్) ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు

# కీసరగుట్టలో బ్రహ్మోత్సవాలు విజయవంతం

**కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన**

**గుడి చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ**


**కీసర, ఫిబ్రవరి 21, (నినాదం) :** కీసర, కీసరగుట్ట శ్రీ భవాని శివ దుర్గ సమేత స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరిగాయి. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ డి విజయేందర్ రెడ్డిని కలిసి ఆలయ చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ అలాగే ఈవో కట్ట సుధాకర్ రెడ్డి కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్వామివారి ప్రసాదాలు అందజేశారు.



# భగ్గుమన్న పాతకక్షలు.. వ్యక్తి దారుణ హత్య

**అన్నదమ్ముల పై సమీప బంధువు కత్తితో దాడి**

**రామగిరి మండల సెంటినరీ కాలనీలో ఘటన**







**యైటింక్లయిన్ కాలనీ, ఫిబ్రవరి 21, (నినాదం):** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీకాలనీలో దారుణం చోటుచేసు కుంది. పాత కక్ష్యలతో పెళ్లికి వచ్చిన వరుసకి బావ అయిన వ్యక్తిని దారుణంగా హతమార్చాడు. పోలీసులు, మృతుడి భార్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన మొలుగూరి కొమురయ్య(58) సెక్యూరిటీ గార్డు గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన తమ్ముడు సత్తయ్య సుల్తానాబాద్ మండలం నారాయణరావుపల్లిలో నివాసం ఉంటున్నాడు. అయితే బేగంపేట గ్రామానికి చెందిన మొలుగూరి సత్తయ్య బావమరిది బుర్ర రాజకొమురయ్య కొడుకు 2011 లో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. తన కుమారుడిని మొలుగూరి కొమురయ్య, సత్తయ్యే చంపించి, రోడ్డు ప్రమాదంగా చిత్రికరించారని రాజకొమురయ్య వారి పై కక్ష్య పెంచుకున్నాడు. అప్పటి నుండి పలుమార్లు వాళ్లని చంపుతానని బెదిరించినట్లు తెలిసింది. ఈ క్రమంలో శనివారం మొలుగూరి కొమురయ్య, సత్తయ్య అక్క కుతూరు వివాహం సెంటినరీ కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్ లో జరుగుతుండగా అన్నదమ్ములు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. అదే పెళ్ళికి రాజాకొమురయ్య సైతం వచ్చాడు..అప్పటికే పాత కక్షతో రగిలిపోతున్న రాజాకొమురయ్య వారిని చూసి కోపోద్రేకుడాయ్యడు. ఫంక్షన్ అన్నదమ్ములు పై ఓ కన్నేసి ఉంచాడు. ఇద్దరు కలిసి ఫంక్షన్ హాల్ నుండి బయటికి వెళ్తుండగా ఒక్కసారిగా బుర్ర రాజకొమురయ్య ఇరువురి పై కత్తితో దాడికి యత్నించాడు.. దాడిలో సత్తయ్యకు అడ్డుగా కొమురయ్య వెళ్లగా తీవ్రమైన కత్తి పోట్లకు గురై అక్కడిక్కడే మృతి చెందగా, తమ్ముడు సత్తయ్య గాయాలతో బయటపడ్డాడు. నిందితుడు బుర్ర రాజకొమురయ్య ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రామగిరి ఎస్సై శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు.

# ఉచిత వైద్య శిబిరాలు నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలి

**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**




**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 21 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 126 - జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్ప వద్ద గల సంస్కృతి హై స్కూల్ ల్లో మల్లారెడ్డి హాస్పిటల్, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ (నార్త్) సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలు అత్యధికంగా నివసించే జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న



సంస్కృతి హై స్కూల్ యాజమాన్యానికి, మల్లారెడ్డి హాస్పిటల్ డాక్టర్ల బృందానికి, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ (నార్త్) సభ్యులకు నా అభినందనలు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ గడ్డమీది బాల్ రాజ్, కార్పొరేటర్ జగన్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు ఆజం, మెట్ల శ్రీను, త్రివేణి, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు బి.ఆంజనేయులు, చల్లా శ్రీనివాస్ రెడ్డి, వినోద్ జాదవ్, సిహెచ్.నరసింహులు, ఎస్. ఆర్. భాషా, మల్లారెడ్డి హాస్పిటల్ డాక్టర్ల బృంధం తదితరులు పాల్గొన్నారు.

# మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా జరిపిన లోటస్ అడ్వాన్స్ స్కూల్



**నిర్మల్ ప్రతినిధి,(సారంగాపూర్) ఫిబ్రవరి21.( నినాదం):** సారంగాపూర్ మండలం ఆడెల్లి గ్రామంలోని లోటస్ అడ్వాన్స్ స్కూల్లో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బిసు జోసెఫ్ మాట్లాడుతూ దేశంలో జీవిస్తున్న ప్రజలందరూ తమ తమ మాతృభాషని గౌరవించుకోవాలని మాతృభాషలోనే మాట్లాడాలని భాష గొప్పతనాన్ని అవసరాన్ని పిల్లలకు వివరించారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ ప్రవీణ్ మాట్లాడుతూ వ్యక్తులు తమ భావాన్ని వ్యక్తీకరించే సాధనమే భాష అని ప్రస్తుత కాలంలో తెలుగు భాషను మర్చిపోయి ఆంగ్ల భాషని మాతృభాషగా భావిస్తున్నారని అది పూర్తిగా తప్పని తెలుగు భాష గొప్పతనాన్ని వివరిస్తూ అమ్మ భాషగా వర్ణించారు విద్యార్థులందరూ ఇంటి వద్ద మమ్మీ డాడీ వాటికి స్వస్తి పలికి అమ్మా నాన్న అన్నా చెల్లి అని మధురమైన తెలుగు భాషలో మాట్లాడాలని నాటికల ద్వారా పాటల ద్వారా భాష గొప్పతనాన్ని తెలిపిన విద్యార్థులను అభినందించారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బిషు జోసెఫ్ కరాస్పాండెంట్ గోస్కుల ప్రవీణ్ పాఠశాల ఉపాధ్యాయులు సరస్వతి రాణి కావ్య అర్చన మంజుల రమ శిరీష వినీత రాథోడ్ రాము పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

# నినాదం

## తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం, తెలంగాణ

22 ఫిబ్రవరి 2026


### హాల్ టికెట్లు ఇవ్వని కళాశాలపై..

## చర్యలు తీసుకోవాలి

**ఎస్ఎఫ్ఐ డివిజన్ ప్రధాన కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్**



**చేవెళ్ల ఫిబ్రవరి 21 (నినాదం):** ఫీజుల పేరుతో హాల్ టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న కళాశాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ పేర్కొన్నారు.. శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ (భారత విద్యార్థి ఫెడరేషన్) చేవెళ్ల డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి బేగారి అరుణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో అరుణ్ కుమార్ మాట్లాడుతూ చేవెళ్ల డివిజన్లో ఉన్నటువంటి నాలుగు మండలాలు(చేవెళ్ల, షాబాద్, శంకర్పల్లి, మొయినాబాద్) ఉన్నటువంటి ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజు కట్టని పేరుతో హాల్ టికెట్ ఇవ్వకపోతే, లేదా స్కాలర్షిప్ పడలేదు అని వేధింపులకు గురి చేస్తే నిరంతరం విద్యార్థులకు ఉన్నటువంటి సమస్యల పైన పోరాటాలు చేసేటువంటి విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ నాయకులకు తెలియజేయగలరని సూచించడం జరిగింది. అదేవిధంగా సమాచారం అందిన వెంటనే స్పందించి ఖచ్చితంగా ప్రవేట్ కాలేజీల యజమాన్యంతో మాట్లాడి హాల్ టికెట్ ఇప్పించడం కూడా జరుగుతుందని తెలియజేశారు. ఈ సమావేశంలో చేవెళ్ల మండల కార్యదర్శి మాల.చందు, మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్, చేవెళ్ల మండల్ సహాయ కార్యదర్శి మణికంఠ, సోషల్ మీడియా ఇంచార్జి వినోద్, తరుణ్, సంతోష్ , వేణు రిశికిరణ్. తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల హామీల అమలు కోరుతూ జేపీసీ పాలాభిషేకం



**నల్లబెల్లి, ఫిబ్రవరి 21 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి బస్టాండ్ ఆవరణంలో తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం వారికి ఇచ్చిన హామీల అమలు కోరుతూ మండల జేఏసీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరామ్, నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి సంఘీభావం తెలిపారు. జేఏసీ మండల చైర్మన్, విద్యార్థి జేఏసీ కన్వీనర్ వేముల రాజు మామిండ్ల ఐలయ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గుర్తించి వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులు, 250 చదరపు గజాల ఇంటి స్థలం ఇతర సంక్షేమ పథకాలు అమలు చేస్తామని అప్పట్లో పీసీసీ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న ఎనుముల రేవంత్ రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలంగాణ ఉద్యమకారుడు సిరిపురం యాదన్న అమరత్వాన్ని స్మరించుకుంటూ, ఈ నెలాఖరు లోపు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ప్రకటించారని తెలిపారు. ఆ ప్రకటనకు మద్దతుగా స్వాగతంగా జేఏసీ నాయకులు ఈ పాలాభిషేక కార్యక్రమాన్నినిర్వహించినట్లు చెప్పారు. ఉద్యమకారుల పట్ల ప్రభుత్వం సానుకూల దృక్పథంతోవ్యవహరించాలని, ఇచ్చిన హామీలు మాటలకే పరిమితం కాకుండా కార్యరూపం దాల్చాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో తమ ప్రాణాలను అర్పించిన అమరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధికార ప్రతినిధి ఆకుల సాంబరావు, బట్టు సాంబయ్య, పెద్ద ఐలయ్య, కొయ్యడ కుమారస్వామి, ఎన్నమల నర్సన్న, ప్రభాకర్, పల్లికొండ రవి, తంగెళ్ల భాస్కర్, వేణు, ఓదెల రవి పాల్గొన్నారు.

## నామాల ఉప్పమ్మ మృతికి సంతాపం



**నల్లబెల్లి, ఫిబ్రవరి 21 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని ముచ్చింపుల తండ (ఆడేపు వాడ) గ్రామానికి చెందిన నామాల శంకరయ్య, నామాల రఘుపతి తల్లి నామాల ఉప్పమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆమె మృతితో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ దుఃఖ సందర్భంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బానోతు సారంగపాణి గ్రామానికి చేరుకుని ఉప్పమ్మ భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ అపార నష్టాన్ని భరించే ధైర్యం కలగాలని ప్రార్థించారు. ఉప్పమ్మ గ్రామంలో అందరితో సౌహార్దంగా మెలిగే వ్యక్తిగా పేరొందినవారని గ్రామస్తులు తెలిపారు. ఆమె మృతి గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొని తుదివిదాయలు పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు గుగులోతు సదర్ లాల్, గ్రామ సర్పంచ్ మచ్చిక రవీందర్, మాజీ ఉపసర్పంచ్ గుగులోతు సురేందర్, మాజీ సర్పంచ్ గుగులోతు రాము, గుగులోతు గోలియా, చింతకింది శ్రీహరి, నవీన్, శంకరయ్య, మలిరెడ్డి రాంరెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండల, గ్రామ పార్టీ నాయకులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హాజరై ఉప్పమ్మ నివాళులు అర్పించారు.

# 17వ వార్డు మరో హౌసింగ్ బోర్డ్ కాలనీ కానుందా..?

**వర్షాకాలం వస్తుందంటే**
**వణుకుతున్న వార్డు ప్రజలు**
**17వ వార్డును కాపాడండి**
**వైస్ చైర్మన్‌ను కోరిన ప్రజలు**
**వార్డు సమస్యలు పరిష్కరిస్తా..**
**వైస్ చైర్మన్ జావేద్..**





**జమ్మికుంట, ఫిబ్రవరి 21 (నినాదం) :** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 17 వ వార్డు ను మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ జావిద్ శనివారం సందర్శించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ తో కలిసి వార్డును సందర్శించిన మున్సిపల్ వైస్ చైర్మన్. ఈ సందర్భంగా వార్డులో ఉన్న సమస్యలపై స్థానిక ప్రజలతో కలిసి పరీక్షించిన మున్సిపల్ వైస్ చైర్మన్ జావేద్. ముఖ్యంగా వార్డులో డ్రైనేజీ సమస్య బాగా ఉందని అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని వెంటనే నూతన పాలకవర్గం ఈ కాలనీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు వైస్ చైర్మన్ దృష్టికి పలు సమస్యలను తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు మాట్లాడుతూ, వర్షాకాలం వచ్చిందంటే జమ్మికుంట హౌసింగ్ బోర్డు పరిస్థితి ఎలాగైతే ఉంటుందో అదే పరిస్థితి 17 వ వార్డులో ఉంటుందని గత సంవత్సరం కురిసిన వర్షాలకు చాలామంది నిరుపేదల ఇండ్లు కూలిపోయాయని వారు తెలిపారు. వర్షాకాలం వచ్చిందంటే మున్సిపల్ పరిధిలోని 28,20,16 వార్డులకు సంబంధించిన వర్షపు నీరు మొత్తం కూడా 17వ వార్డుకు చేరుకుంటుందని దాని ద్వారా డ్రైనేజీ సరిపోక ఇండ్లలోకి నీరు చేరి స్థానిక ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. కేవలం మూడు ఫీట్ల డ్రైనేజీ ఉందని వర్షాకాలం వచ్చిందంటే అది నిండి నీరు మొత్తం ఇళ్లలోకి చేరి గోడలు కూడా కూలిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న పది ఫీట్ల సిసి రోడ్డు కింద ఎనిమిది ఫీట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుందని అప్పుడు రోడ్డు కూడా వెడల్పు అవుతుందని స్థానికులు తెలిపారు. గత పాలకులు ఈ వార్డుపై సవతి తల్లి ప్రేమ చూపెట్టారని నూతన పాలకవర్గమైన ఈ కాలనీవాసుల సమస్యలను పట్టించుకోవాలని వైస్ చైర్మన్ జావిద్ దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ సమస్యకు పరిష్కారం వస్తుందని ఎందుకంటే రైల్వే ట్రాక్ ప్రక్కన ఈ కాలనీ ఉండటం వల్ల వారి సహకారం లేనిది ఈ సమస్య పరిష్కారం కాదని పాలకవర్గం కేంద్రం రాష్ట్రం నాయకులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తే ఈ వర్షాకాలం ఇబ్బందులు లేకుండా ఉంటుందని వారు తెలిపారు.

**17వ వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా... జావేద్**

ఇటీవల జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన జావేద్ శనివారం 17వ వార్డును సందర్శించిన సందర్భంగా వార్డు ప్రజల సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లి వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎక్కువ శాతం నిధులను ఈ వార్డుకు కేటాయించి భవిష్యత్తులో వార్డుకు ఎలాంటి సమస్యలు రాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం కోసం తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ ప్రముఖ న్యాయవాది దూడపాక శ్రీనివాస్ తో పాటు స్థానికులు ఉన్నారు.

# కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ స్టార్ట్

- **మార్చిలో జరిగే శిక్షణా తరగతులను విజయవంతం చేయాలి**
- **బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతి కుమార్**



**కరీంనగర్, ఫిబ్రవరి 21(నినాదం):** తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం ప్రప్రదంగా కరీంనగర్ గడ్డపై తొలిసారిగా మేయర్ స్థానాన్ని కైవసం చేసుకోవడం శుభ పరిణామని , కరీంనగర్ గడ్డ నుండే రాష్ట్ర చరిత్రను మార్పు చేసే అనేక ఘటనలు జరిగాయని, కరీంనగర్ సెంటిమెంట్ ను ఎంతోమంది బలంగా విశ్వసిస్తారని, సెంటిమెంట్ గుబులు అన్ని పార్టీలకు మొదలైందని , చరిత్ర తిరగరాసే విధంగా బల్దియా పై కాషాయ జెండా ఎగరవేసిన బీజేపీ ఇక తిరుగు లేదని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతి కుమార్ అన్నారు. శనివారం రోజున కరీంనగర్లోని సాయి మహాలక్ష్మి గార్డెన్స్ లో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ 2026 కరీంనగర్ జిల్లా కార్యశాల ప్రోగ్రాం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలన పట్ల తీవ్ర ప్రజా వ్యతిరేకత మొదలైందని , రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోయిందని , భవిష్యత్తు అంతా బిజెపి దేనన్నారు. ఉచితాలు, హామీలు, ఆరు గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ గారడి చేసి ప్రజలను తీవ్రంగా మోసం చేసిందన్నారు. రెండున్నర ఏళ్లలో కాంగ్రెస్ పూర్తిగా ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని మరిచి సీఎం కుర్చీని కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారన్నారు. వచ్చేనెల జరగబోయే ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యక్తి నిర్మాణం ద్వారా సంస్థ నిర్మాణం, సంస్థ నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం అని చాటి చెప్పిన పార్టీ సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చూపెట్టిన మార్గంలో పార్టీ శ్రేణులు అందరూ నడవాలన్నారు. శిక్షణ లో అనేక విషయాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని , ప్రతి ఒక్కరూ ఈ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ప్రశిక్షణ ప్రోగ్రాం కు సంబంధించి పార్టీ శ్రేణులకు మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి , రాష్ట్ర మహిళా నాయకురాలు నిర్మలారెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శులు మాడ వెంకటరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, పార్లమెంటు కన్వీనర్ , కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావ్ , ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ లతో పాటు వివిధ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిల్లల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి

**ఇంటిదగ్గర ప్రత్యేకమైన స్టడీ కార్నర్ ఏర్పాటు చేయాలి**

**ఇంటి వద్ద చదువుకోవడానికి ప్రశాంతమైన, వాతావరణం ఏర్పాటు చేయాలి**





**చేవెళ్ల ఫిబ్రవరి 21 (నినాదం):** పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక్ష శ్రద్ధ వహించి, విలువైన సమయాన్ని చదువు కోసం కేటాయించేలా చూడాలని ఉపాధ్యాయులు మరుపల్లి అశోక్ అన్నారు.. శనివారం చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలం ప్రాథమిక పాఠశాల మన్మర్రిలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి, విద్యార్థుల ప్రగతి పనితీరును తల్లిదండ్రులకు వివరించారు. ఈ సమావేశంలో విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్, గణిత అంశాలకు సంబంధించి భాష, న్యూమరాసి, పద్య, గద్య రూపంలో కొన్ని ప్రతిభ పఠన నైపుణ్యాలను తల్లిదండ్రుల సమక్షంలో ప్రదర్శించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మర్పల్లి అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ బడులలో చదువుకునే విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు దీటుగా పోటీపడి చదువుతున్నారని, ఉపాధ్యాయులు తరగతిలో బోధించే అంశాలను ఇంటిదగ్గర విద్యార్థులు చదువుతున్నారా లేదా అనే విషయాన్ని తల్లిదండ్రులు పర్యవేక్షించాలని, తల్లిదండ్రులు వారి పిల్లల కోసం ఇంటిదగ్గర కొంత సమయం కేటాయించి వారి యొక్క చదువులను క్షుణ్ణంగా పరిశీలించాలని, విద్యార్థుల చదువుల పట్ల ఎలాంటి సందేహాలున్న పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులను కలవాలని, విద్యార్థుల చదువులకు సంబంధించిన అంశాల పట్ల చర్చించాలని,ప్రతి ఇంట్లో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్టడీ కార్నర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్షలు సమీపిస్తునందున విద్యార్థులు ఇంటి దగ్గర ఆటలు తగ్గించి పాఠశాలలో నేర్చుకున్న అంశాలను ఇంటి దగ్గర తిరిగి చదవాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రామ ప్రథమ పౌరులు లాలాపేట బందెయ్య, వార్డు సభ్యులు రాములు, వెంకటేష్, అనురాధ, మమత, రాధిక, కొమరమ్మ, మానెమ్మ, హారిక, ఈదయ, సతీష్, శంకరయ్య, నరసింహులు, బీరయ్య లక్ష్మి, మాధవి, ఉపాధ్యాయులు, వెంకటమ్మ, శ్రీలత, చంద్రకళ, పాఠశాల సిబ్బంది శ్యామలమ్మ, మల్లమ్మ పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తా..





- **దాసాంజనేయ స్వామి వారి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రాజు**

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 21 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ బౌరంపేట్ 296 డివిజన్ లో శనివారం శ్రీ దసాఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. శ్రీ దసాఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలోమాజీ గ్రంథాలయ చైర్మన్ నాగరాజ్ యాదవ్, ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, దుండిగల్ పురపాలక మాజీ చైర్మన్ శంభిపూర్ కృష్ణవేణి కృష్ణ, తాజా మాజీ కౌన్సిలర్లు బెంబడి బుచ్చిరెడ్డి, పల్పనూరి మౌనిక విష్ణు వర్ధన్, నాచారం మురళి యాదవ్, మరియు స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షులు మల్గం యల్లయ్య అనారోగ్యం మృతి



**మిర్యాలగూడ ఫిబ్రవరి 21 (నినాదం):** తెలంగాణ రాష్ట్రకురుమ సంఘం ఉపాధ్యక్షులు,నల్లగొండ జిల్లా మిర్యాలగూడ లోని బంగారుగడ్డ కు చెందిన మల్గం యల్లయ్య (60) అనారోగ్యం తో హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ మరణించాడు. ప్రస్తుతం యల్లయ్య మిర్యాలగూడ లోని షాబునగర్ జడ్పి స్కూల్ లో డిప్యుటీషన్ పైన రికార్డు అసిస్టెంట్ గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ సంవత్సరం అక్టోబర్ మాసం లో పదవి విరమణ పొందనున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. యల్లయ్య కురుమ కులస్తులను ఐక్యం చేసి వారి సమస్యల సాధన కోసం కృషి చేశాడు. మిర్యాలగూడ లో బీరప్ప గుడి నిర్మాణానికి ఎంతో కృషి చేసి ఘనంగా బీరప్ప పండుగను జరిపించడం విశేష కృషి చేశాడు. యల్లయ్య అకాల మరణం పట్ల కురుమ సంఘం పెద్దలు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు, పట్టణ ప్రజలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు నల్లబోతుల భాస్కర్ రావు,జూలకంటి రంగారెడ్డి,తిప్పన విజయసింహారెడ్డి, మిర్యాలగూడ మున్సిపల్ ఛైర్మెన్ చిలుకూరి సుధా-బాలకృష్ణ, కౌన్సిలర్ మల్గం రమేష్, జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు జమ్ము రమేష్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారి అవిలయ్య, శాలిగౌరారం లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మెన్ బుడిగె శ్రీనివాసులు తో పలువురు నాయకులు యల్లయ్య భౌతిక ఖాయం పై పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. యల్లయ్య అంత్యక్రియలు శనివారం సాయంత్రం శోక సముద్రం లో జరిగాయి.

## ఘనంగా మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు





**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 21 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ రాజీవ్ గాంధీ నగర్ మెకానిగూడలో వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఫిబ్రవరి 21 శనివారం అంగరంగ వైభవంగా ఘనంగా ప్రారంభమైనాయి. శ్రీ మల్లికార్జున స్వామి వారి జాతర వేడుకల్లో భాగంగా మొదటి రోజు శనివారం ఉదయం నాలుగు గంటలకు గంగా పూజ పుట్టపూజ నంద పూజతో వేడుకలు ప్రారంభమైనాయి. ఈ వేడుకల్లో భాగంగా జాతర వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించకుండా ఆలయ కమిటీ సభ్యులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. జాతర వేడుకల్లో ఆదివారం ప్రధానఘట్టం వేడుకలు అత్యంత వైభవంగా కన్నుల పండుగగా జరుపుటకు కావలసిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు వివరించారు. స్వామి వారి జాతర వేడుకలకు భక్తులు వేలాదిగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ డైరెక్టర్ పర్ష శ్రీనివాస్ యాదవ్, పాండు యాదవ్, మల్లేష్ యాదవ్, బాలరాజు యాదవ్, ఆంజనేయులు యాదవ్ తదితర సభ్యులు పాల్గొన్నారు.